సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



కుళ్లుతున్న ఉల్లి.. కన్నీళ్లే మళ్లీ

ప్రస్తుత వర్షాలకు ఉల్లి పంట భూమిలోనే కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు దిగాలు పడుతున్నారు. మరోవైపు ఉల్లి కొనుగోలు ప్రకటన పరిమితమైంది. -8లో



టీడీపీ కుటిల రాజకీయం

సీపీ బ్రౌన్ గ్రంథాలయం అదనపు కట్టడాల నిర్మాణాల విషయంలో టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. అక్రమ కేసులు పెట్టి కుటిల రాజకీయం చేస్తున్నారు. -9లో

గరిష్టం/కనిష్టం
32.0/22.3

వాతావరణం

జిల్లాలో గురువారం 22.3 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

గడువు పొడగింపు

కడప ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకునేందుకు ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. అలాగే 2021,22,23 సంవత్సరాలలో ఎంపికై గతేడాది నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టర్‌లో అప్లికేషన్ నమోదు చేసుకున్న విద్యార్థులకు మరో అవకాశం కల్పించి 30వ తేదీ వరకు గడువు ఇచ్చిందన్నారు. ఈ సంవత్సరం 10,11,12 తరగతులు ప్రభుత్వం, ఎయిడెడ్ విద్యాలయాల్లో సాధారణ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరు కూడా ఈ సంవత్సరం రెన్యువల్ చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

ప్రైవేటీకరణకు నిరసనగా నేడు 'చలో మెడికల్ కాలేజ్'



పులివెందుల: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా శుక్రవారం చలో మెడికల్ కాలేజ్ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం 2019–24 మధ్యలో 17 మెడికల్ కళాశాలలను నిర్మాణం చేయగా వాటిలో 5 కాలేజీల్లో విద్యాబోధన కూడా జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీల మీద చేస్తున్న అసత్య ఆరోపణలు, అబద్ధపు ప్రచారాలతోపాటు ప్రైవేటీకరణ చేస్తున్న తరుణంలో వాటిని ఖండిస్తూ శుక్రవారం 'చలో మెడికల్ కాలేజ్'పేరుతో నిరసన కార్యక్రమం జరపాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా యూత్, స్టూడెంట్, వలంటీర్, సోషల్ మీడియా విభాగాలతో పాటు ఇతర విభాగాల వారు శుక్రవారం 10.30 గంటలకు పులివెందులలోని డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కళాశాల వద్దకు చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అందులో వివరించారు.

భూబకాసురులు!

ఖాళీ జాగాలు కనిపిస్తే చాలు 'పచ్చ గద్దలు' వాలిపోతున్నాయి.. కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాలను పట్టపగలే మింగేస్తున్నాయి. కొండల్ని..గుట్టల్ని సైతం తవ్వేస్తూ చెరబడుతున్నాయి.. అధికార ఒత్తిడికి తోడు.. అక్రమ సొమ్ము జేబుల్లోకి చేరడంతో అధికార యంత్రాంగం దగ్గరుండి మరీ 'తమ్ముళ్లకు' కొమ్ముకాస్తోంది.

- యథేచ్ఛగా భూ ఆక్రమణలకు పాల్పడుతున్న అధికార పార్టీ నేతలు
- బద్వేలు నియోజకవర్గ పరిధిలో క్రమం తప్పకుండా భూదందాలు
- ప్రభుత్వ భూములపై కన్నేసిన 'తమ్ముళ్లు'
- కట్టడి చేయకపోగా, అక్రమార్కుల కొమ్ముకాస్తున్న అధికారులు



నల్లాయపల్లి రెవెన్యూ పొలంలో యంత్రాలతో చదును చేసిన ప్రభుత్వభూమి

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లాలో భూ దందాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. అధికార పార్టీ నేతలు..కార్యకర్తల భూదాహానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. కోట్లాది రూపాయాల విలువైన ప్రభుత్వ భూమి పరులపాలవుతుంటే.. అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం అధికార మత్తులో జోగుతోంది.

- అట్లూరు మండల పరిధిలోని నల్లాయపల్లి రెవెన్యూ పొలంలో సర్వేనెంబరు 40లో 445.81 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. సారవంతమైన ఆ భూమి వ్యవసాయానికి అనువుగా ఉంది. బద్వేల్ మండలానికి చెందిన తెలుగుతమ్ముళ్లకు ఆ భూమిపై కన్నుపడింది. అంతే.. జేసీబీ యంత్రాలు, డోజర్ ట్రాక్టర్లతో యథేచ్ఛగా చదును చేశారు. పట్టపగలు బాహాటంగా ఆక్రమణలకు పాల్పడుతున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. స్థానికులు సమాచారమిచ్చినా ఉన్నతాధికారులు స్పందించలేదు. వీఆర్వోను పంపించి చేతులు దులుపుకున్నారు. పైగా ఆక్రమణదారులకు సమాచారం అందించారు. స్థానికులు అప్పగించిన జేసీబీ సైతం తర్వాత వదిలేశారు. దాదాపు 40 ఎకరాల మేరకు చదును చేసినట్లు స్థానికులు వివరిస్తున్నారు.

ప్రభుత్వ భూమిగా నిర్ధారించినా..

బద్వేల్ నియోజకవర్గంలో అధికారపార్టీకి రెవెన్యూ యంత్రాంగం అండగా నిలుస్తోంది. బి.కోడూరు మండలం వేముకుంట గ్రామంలో సర్వే నంబర్ 18లో 16.50 ఎకరాలు ప్రభుత్వ గయ్యాలి భూమిని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తన అనుచరుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న నేపథ్యంలో గ్రామస్తులు రెవెన్యూ కోర్టులను ఆశ్రయించారు. రాజంపేట ఆర్డీఓ కోర్టు (ఈ3)/1916/2016లో ద్వారా 2016లో ప్రభుత్వ గయ్యాలి భూమిగా తీర్పు ఇచ్చింది. ఆపై విజయమ్మ తనయుడు ప్రస్తుత టీడీపీ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి కడప జాయింట్ కలెక్టర్ కోర్టును ఆశ్రయించగా జేసీ కోర్టు సైతం ఆర్డీఓ కోర్టు తీర్పును సమ్మతిస్తూ ప్రభుత్వ గయ్యాలి భూమిగా డిసెంబర్ 23, 2022 తేదిన ఉత్తర్వులు ఇచ్చింది. ఆర్డీఓ, జేసీ కోర్టుల తీర్పునసరించి బి.కోడూరు తహసీల్దార్, వేముకుంట ప్రజల సమక్షంలో పంచనామా చేపట్టారు. సర్వేనంబర్ 18లో 16.50ఎకరాలు భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ భూమి బోర్డు పెట్టారు.



రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న జేసీబీ యంత్రం

పోలీసుస్టేషన్ భూమికి ఎసరు

కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు ఆర్ అండ్‌ఆర్ సెంటర్ ఏర్పాటులో భాగంగా 1.38 ఎకరాలు తాళ్లప్రొద్దుటూరు పోలీసుస్టేషన్‌కు కేటాయించారు. ఆమేరకు తహసీల్దార్ రెఫరెన్స్ నెం.ఎ/785/2021తో డిసెంబర్ 13, 2021న పొజిషన్ సర్టిఫికెట్ కూడా అప్పగించారు. ఇప్పుడా స్థలంపై కూటమి నేతల కన్ను పడింది. నేషనల్ హైవే–67 రోడ్డుపక్కనే ఉండడంతో సెంటు రూ.3లక్షలు పలుకుతోంది. అందులో 50 సెంట్లు భూమి కొట్టేసేందుకు సరికొత్త వ్యూహం పన్నారు. ఓ ఎమ్మెల్యే ఒత్తిడి కారణంగా స్థానికంగా పోలీసు, రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారు. ఆ మేరకు సిఫార్సులు చేస్తూ కలెక్టరేట్‌కు ఫైల్ పంపించారు. విషయం తెలుసుకున్న మునుపటి ఎస్పీ అశోక్ కుమార్ జాయింట్ కలెక్టర్‌కు అభ్యంతరం చెబుతూనే, ఆ స్థలానికి కంచె వేయించారు. పోలీసుస్టేషన్‌కు కేటాయించిన స్థలం ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారని ప్రజలు కూడా వాదిస్తున్నా అవేవి పట్టించుకునే దిశగా రెవెన్యూ యంత్రాంగం ఆలోచనలు కన్పించడం లేదు. పెద్ద మొత్తంలో చేతులు మారడంతో పోలీసుస్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని కూడా అప్పగించేందుకు సంసిద్ధమైనట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా కోట్లాది విలువైన ప్రభుత్వ భూములు పరులుపాలు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం కృతనిశ్చయంతో ఉండిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడంలో నిర్లక్ష్యం



ప్రభుత్వ భూమిగా ఆర్డీఓ, జేసీ కోర్టులు నిర్దేశించిన సదరు భూమిపై హైకోర్టు స్టేటస్–కో 2022లో ఉత్తర్వులిచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మూడేళ్లుగా కోట్లాది రుపాయాలు విలువైన భూముల విషయంలో రెవెన్యూశాఖ చేష్టలుగి చూస్తుండిపోయింది. బహిరంగ మార్కెట్‌లో రూ.3కోట్లు పైబడి పలికే వేముకుంట ప్రభుత్వ గయ్యాలి భూమి రితేష్‌రెడ్డి ధాదాదత్తం చేసేందుకు సహకరిస్తోందనే ఆరోపణలున్నాయి.

20న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగ కార్యవర్గ సమావేశం

- రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబుతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రాక
- జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు పిలుపు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని పాత రిమ్స్ ఆవరణలో ఉన్న బీసీ భవన్‌లో ఈనెల 20వ తేది ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌బీ సతీష్‌రెడ్డిలతో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. ఎన్నికల ముందు దళితులకు ఎన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో దళితులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం. సుబ్బరాయుడు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేస్తే సీఎం, డిప్యూటీ సీఎంలు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యలన్నింటిపై సమావేశంలో చర్చించనున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, నాయకులు బండి ప్రసాద్, రవి, అజయ్, శ్యామ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాన వెల్లువాయె!



రాజుపాలెం-వెంగళాయపల్లె గ్రామాల మధ్య రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

మేఘం గర్జించింది.. చిమ్మ చీకటి వేళ.. కమ్ముకొచ్చి కుండపోతగా కురిసింది..అంతే తెల్లారేకల్లా వాగు ఉప్పొంగింది. నదీ ప్రవాహం ఉగ్రరూపం దాల్చింది.. ఇల్లంతా నీరు... ఊరంతా ఏరయింది. ఇక పంటంతా నీటిలో మునిగింది.. రైతు కంట కన్నీరొలికింది. గురువారం తెల్లారుజామున కురిసిన వర్షం.. పలు మండలాల్లో బీభత్సమే సృష్టించింది.

జిల్లాలో దంచి కొట్టిన వర్షం

- పలు కాలనీలు జలమయం
- పలుచోట్ల రాకపోకలు బంద్
- ఉద్యానపంటలతోపాటు వ్యవసాయ పంటలకు నష్టం

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో గురువారం తెల్లవారుజామున కుండపోత వాన కురిసింది. జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దీంతో కంది, మినుము, ఉల్లి, జొన్నలతో పాటు పలు ఆరుతడి పంటల్లో వర్షపు నీరంతా నిలిచింది. పంట పొలాల్లో నిలిచిన వర్షపునీరు వంకలను తలపించాయి. జిల్లాలో ఎర్రగుంట్ల మండలంలో అత్యధికంగా 132.2 మి.మీ వర్షం కురవడంతో పొట్లదుర్తిలోని ఎన్‌టీఆర్‌కాలనీ, ఎర్రగుంట్లలోని సుందరయ్యకాలనీలు వర్షపు నీటితో నిండిపోయాయి. ఎర్రగుంట్ల ప్రొద్దుటూరు మధ్య ప్రధాన రహదారిలోని కుంది నదీ ఉధృతంగా ప్రవహించడంతో కొన్ని గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. తిప్పలూరులో మసీదు ప్రహరీ కూలిపోయింది. పాగేరు వంక ఉధృతంగా ప్రవహించడంతో కమలాపురం– ఖాజీపేట మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే పెద్దముడియం మండలం పాలూరులోని నోస్సం వంక ఉధృతంగా ప్రవహించింది. కన్నెలూరులోని నివాసం ఉన్న ఓ కుటుంబం బైక్‌లో నొస్సం వంక దాటుతుండగా అదుపుతప్పి కొట్టుకపోతుండటంతో పాలూరుకు చెందిన కొంతమంది యువకులు కాపాడి ఒడ్డుకు చేర్చారు. అలాగే ప్రొద్దుటూరు ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో రాజుపాలెం వెంగళాయపల్లి గ్రామాల మధ్యలో మడువంకపై వర్షపు నీరు ప్రవహించడంతో కొన్ని గంటలపాటు రాకపోకలు ఆగిపోయాయి. పెద్దముడియంలో పంటపొలాల్లో నీరు నిలిచి చెరువులను తలపించాయి. ఈ వర్షంతో విత్తిన మినుమంతా భూమిలోనే కుళ్లిపోతుందని రైతులు వాపోయారు. ఉల్లిగడ్డలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వల్లూరు: కోట్లూరు పొలాల్లో నేలకొరిగిన వరి



కడప నగరంలోని ఫాతిమా కాలేజ్ వద్ద..

ఎర్రగుంట్లలో అత్యధికంగా..

అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలలో ఎర్రగుంట్లలో అత్యధికంగా 132.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే ప్రొద్దుటూరులో 120.2, సికెదిన్నెలో 110.4 , పెండ్లిమర్రిలో 89.4 , రాజుపాలెంలో 83.2 , పెద్దముడియంలో 80.8 , వల్లూరులో 76.8, చెన్నూరులో 78.6 , పులివెందుల్లో 77 , కమలాపురంలో 76.2 , వేంపల్లిలో 68.2 , ఖాజీపేట 66 , వీఎస్‌పల్లిలో 60.2 కడపలో 54.8 , చక్రాయపేటలో 53.2 , సిద్దవటంలో 48.2 , ముద్దనూరులో 43.2 , దువ్వూరు 34.6 , ఒంటిమిట్టలో 32.2 , జమ్మలమడుగులో 30.2 , లింగాల 25.2 , అట్లూరు 26.2 , సింహాద్రిపురం 19.6 , మైదుకూరు 16.2 , వేముల 15 , తొండూరు 12.4 , బద్వేల్ 12.2 , చాపాడు 8.6 , మైలవరం 7.4 , పోరుమామిళ్ల 6.2 , బిమఠం 5.8 , బి కోడూరు 3.8 , కాశినాయన 2 , గోపవరం 1.6 మి.మీ వర్షం కురిసింది.



ప్రొద్దుటూరులో రోడ్డుపై వర్షపు నీరు



కమలాపురం: మైలవరం దక్షిణ కాలువకు పడిన గండి



వరద తాకిడితో ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు మధ్య వాహనాల రాకపోకలకు అంతరాయం



రాజుపాలెం: ఇంట్లోని వర్షపు నీటిని తోడుతున్న దృశ్యం

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు



ప్రజా దర్బార్‌లో నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, అంజద్‌బాషా

- విచ్చలవిడిగా అక్రమ మైనింగ్, ఇసుక అక్రమ రవాణా, గ్యాంబ్లింగ్
- ఇంత జరుగుతున్నా జిల్లా అధికార, పోలీస్ యంత్రాంగంలో చలనం లేదు
- తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం కడప నగరంలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. అక్రమ మైనింగ్, ఇసుక అక్రమ రవాణా, గ్యాంబ్లింగ్ విచ్చలవిడిగా జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగానికిగానీ, పోలీస్ వ్యవస్థకుగానీ ఇసుమంతైనా చలనం లేదన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు తమను తాము పెద్ద రాజుల స్థాయిలో ఊహించుకుంటూ ఓ చేత్తో రెవెన్యూ, మరో చేత్తో పోలీసులను పెట్టుకొని ఆడిస్తున్నారని ఆరోపించారు. ఇక శాంతి భద్రతలు ఎక్కడినుంచి వస్తాయని ప్రశ్నించారు. ఇటీవలి కాలంలో ఎన్ని సమస్యలు వస్తున్నాయో చూస్తున్నాం కదా...వాటిని నియంత్రించ లేని స్థితిలో పోలీస్ యంత్రాంగం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దౌర్భాగ్యులకు పాలనాపగ్గాలు అప్పగించామా...అని ప్రజలు చింతిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి పద్ధతులు మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నాయకులు పి. జయచంద్రారెడ్డి, జమాల్‌వలీ, షఫీ, సుభాన్‌బాషా, త్యాగరాజు, షంషీర్, గౌస్, అక్బర్ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్ నిర్వహించిన ఎంపీ

కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి కడప ఆలంఖాన్‌పల్లెలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మమేకం అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ అన్నారు. జెడ్పీ ఛైర్మెన్ రామగోవిందు రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ప్రజలు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ ప్రార్థనల్లో ఎంపీ

మిలాద్ ఉన్ నబీ మాసోత్సవం సందర్భంగా కడపలోని శ్రీకృష్ణ దేవరాయ సర్కిల్ సమీపంలో వైఎస్సార్‌సీపీ నేత ఎస్‌ఎండీ ఆజమ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో కలిసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు.

ప్రతి రైతుకు యూరియా అందిస్తాం



యూరియా పంపిణీపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

దువ్వూరు: మండలంలోని ప్రతి రైతుకు యూరియా అందిస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని చింతకుంట గ్రామంలోని యూరియా పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. దువ్వూరు మండలానికి 13,560 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు కాగా, ఇంత వరకు 10వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని కలెక్టర్ అడిగిన ఓ ప్రశ్నకు జేడీఏ చంద్రానాయక్ సమాధానమిచ్చారు. ఇంత స్థాయిలో యూరియా వచ్చినా రైతులకు యూరియా అందలేన్న సమస్య ఎందుకు వస్తోందని కలెక్టర్ వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. అనంతరం సచివాలయంలో రైతులతో కలెక్టర్ మాట్లాడారు. కొంత మంది రైతులకే యూరియా అందుతోందని, యూరియా కోసం క్యూలో ఉన్నా అందడం లేదని పలువురు వాపోయారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని, పూర్తి స్థాయిలో యూరియా అందిస్తామని తెలిపారు.

ఉల్లి రైతులకు న్యాయం చేస్తాం

ఖాజీపేట: ఉల్లి పంటకు సరైన పరిహారం అందించి.. రైతులందరికీ న్యాయం చేస్తామని కలెక్టర్ శ్రీధర్ భరోసా ఇచ్చారు. ఖాజీపేట మండలం చెమ్ముళ్లపల్లెలో ఉల్లి రైతులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. పొలంలోని పంటలను పరిశీలించారు. గిట్టుబాటు ధర దక్కడం లేదని పలువురు రైతులు కలెక్టర్ ఎదుట వాపోయారు. తహసీల్దార్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో చోరీ


బాధితురాలిని విచారిస్తున్న ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులోని జగనన్న కాలనీలో చోరీ జరిగింది. బాధితురాలు వాణి వివరాల మేరకు.. స్థానిక జగనన్న కాలనీలో నివాసముంటున్న వాణి లిటిల్ ఫ్లవర్ పాఠశాలలోనూ, ఆమె భర్త నాగేంద్ర యూసీఐఎల్‌లో పనిచేస్తున్నారు. గురువారం ఉదయం ఇంటికి తాళాలు వేసి ఇరువురు విధులకు వెళ్లగా.. పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు చెప్పారు. బీరువాలో రూ.50 వేల నగదు, ఎనిమిది తులాల బంగారు ఆభరణాలను దొంగలించినట్లు తెలిపారు. ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ మోటార్ల దొంగ అరెస్టు

బద్వేలు అర్బన్ : పగలు పాత సామాన్లు కొంటామని వచ్చి రాత్రి పొలాల వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్తు మోటార్లను ఎత్తుకెళ్తున్న దొంగను బద్వేలు రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. స్థానిక రూరల్ పోలీసుస్టేషన్ ఆవరణలో విలేకరులకు మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణం ఎల్.ఆర్.పల్లిలోని ముస్లీం వీధికి చెందిన పాశం రాజేష్ వివిధ ప్రాంతాల్లో పాత సామాన్లు కొనుగోలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పగలు ఆయా గ్రామాల్లో తిరుగుతూ ఎవరికీ అనుమానం రాకుండా రాత్రిపూట విద్యుత్తు మోటార్లను చోరీ చేస్తున్నాడు. గత నెల 25న గోపవరం మండలం సంద్రపల్లెలో, ఈ నెల 10న బద్వేల్ మండలం వనంపులలోని పొలాల్లో విద్యుత్ మోటార్లు చోరీ చేసినట్లు రైతులు ఫిర్యాదు చేయడంతో విచారించిన పోలీసులు నిందితుడిని గోపవరం మండలం శ్రీనివాసపురం వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. మూడు విద్యుత్ మోటార్లతో పాటు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. రూరల్ సీఐ ఎన్.క్రిష్ణయ్య, ఎస్‌ఐ కె.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపు నిర్వహణపై విచారణ

కడప అర్బన్ : కడప నగరంలోని కేంద్ర కారాగారంలో 2023 నవంబర్, 28న మెడికల్ క్యాంపు నిర్వహణపై కర్నూలు ఎస్పీ విక్రాంత్‌పాటిల్, కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, విజయవాడ కారాగారం సూపరింటెండెంట్ ఇర్ఫాన్, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ గురువారం విచారించారు. కమిటీ అధికారుల ఎదుట క్యాంపు నిర్వహించిన డాక్టర్లు, అప్పటి కారాగార అధికారులు హాజరయ్యారు. విచారణలో వీరి స్టేట్‌మెంట్లను అధికారులు రికార్డు చేశారు.

పోలీసుల అదుపులో ఎర్రచందనం కూలీలు

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు మండలంలోని పెద్దశెట్టిపల్లె వద్ద గురువారం రాత్రి తమిళనాడు రాష్ట్రానికి చెందిన పలువురు ఎర్రచందనం కూలీలను కడప ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 15 మంది కూలీలు రెండు వాహనాల్లో వెళ్తున్నారని సమాచారం రావడంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు పెద్దశెట్టిపల్లె వద్ద కాపుకాచారు. ఈ క్రమంలో వారు అక్కడికి రాగానే పోలీసులు వాహనాలను అడ్డుగా పెట్టి ఎర్రచందనం కూలీలను అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వారిని కడపకు తరలించారు. ప్రధాన స్మగ్లర్ కోసం పోలీసులు వారిని విచారణ చేస్తున్నారు. కూలీల వెనుక ఉన్నది జిల్లాకు చెందిన ప్రధాన స్మగ్లర్‌లా లేక ఇతర ప్రాంతాలకు చెందిన వారా అనేది తెలియాల్సి ఉంది.

కుళ్లుతున్న ఉల్లి.. కన్నీళ్లే మళ్లీ

జిల్లాలోని మైదుకూరు, కమలాపురం మార్కెట్ యార్డులలో ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్ రూ.1200కు కొనుగోలు చేస్తామని ఈ నెల 4న జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రకటించారు. అనంతరం 15 రోజులు గడచినా అతీగతీ లేకపోవడంతోపాటు జేసీ ప్రకటన పేపర్‌కే పరిమితమైందా అంటూ ఉల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రకటనలే పరిమితమైన ఉల్లి కొనుగోలు కేంద్రాలు
- స్వయంగా జేసీ ప్రకటన చేసినా స్పందన కరవు
- కొనుగోలు కేంద్రాలు తెరవని మార్కెటింగ్ అధికారులు
- రెండు రోజుల వర్షంతో రైతుకు కోలుకోలేని దెబ్బ


వర్షం దెబ్బకు కుళ్లుతున్న ఉల్లి

జిల్లాలో సాగైన ఉల్లిపంట వివరాలిలా ఉన్నాయి

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
మీస్‌పల్లి	4089.63
మైదుకూరు	1778.60
వేముల	1004.89
పెండ్లిమర్రి	825.22
దువ్వూరు	904,78
తొండూరు	693.95
వేంపల్లి	391.52
ఎర్రగుంట్ల	311.83
ముద్దనూరు	314.88
కాశినాయన	156.97

కడప అగ్రికల్చర్/సింహాద్రిపురం: జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటివరకూ 11347.67 ఎకరాల్లో రైతులు ఉల్లి పంట సాగు చేశారు. 92,300 క్వింటాళ్ల మేర దిగుబడులు వచ్చే అవకాశముందని అధికారులు ముందస్తు అంచనా వేశారు. చాలా మండలాల్లో ప్రస్తుతం ఉల్లి కోత దశలో ఉంది. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా అల్పపీడనం ఏర్పడి భారీ వర్షాలు కురిసాయి. దీంతో భూమిలోనే ఉల్లి కుళ్లిపోయే ప్రమాదం ఉండడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సింహాద్రిపురం మండలం అహోబిలం రైతు అంకాల్ రెడ్డి ఎకరాకు రూ.70 వేలు వెచ్చించి మూడు ఎకరాల్లో ఉల్లి సాగు చేయగా.. దిగుబడులకు గిట్టుబాటు లేకుండాపోయింది. కొనుగోలు చేస్తామన్న అధికారులు చేతులెత్తేయడం, వ్యాపారి ముందుకు రాకపోవడంతో రైతు ఉల్లి దిగుబడులను ఉచితంగా గ్రామ ప్రజలను తీసుకెళ్లమని చెప్పాల్సి వచ్చింది. ఈయనే కాదు.. మా ఘోష వినేవాళ్లే లేరా అని కన్నీళ్లు దిగమింగుతున్న రైతులు ఎందరో ఉన్నారు.

గోరుచుట్టుపై రోకటిపోటు

ఉల్లి పంటకు మద్దతు ధర క్వింటా రూ.1200లకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జాయింట్ కలెక్టర్ కొనుగోలుకేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పినా అనంతరం స్పందన లేకపోయింది. దీంతో ఒక పక్క మద్దతు ధర లేక.. మరోపక్క ప్రభుత్వం కొనుగోలు చేయక అల్లాడిపోతున్న ఉల్లి రైతుకు గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్లు అల్పపీడనంతో కురిసిన వర్షాలు మరింత కుంగదీస్తున్నాయి. కనీసం సాగు ఖర్చులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆందోళన చెందుతున్నారు. క్వింటా రూ.500లు పలికితే పెట్టిన పెట్టుబడులు కూడా రావని, చేసిన అప్పులు తీరవని రైతులు వాపోయారు. ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెడితే కనీసం కూలి డబ్బు రాని పరిస్థితి ఉందని చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉల్లి పంటకు గిట్టుబాటు ధర కలిప్తే రైతన్నలు మేలు జరుగుతుందని, లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పొలంలో పారబోసిన ఉల్లి గడ్డలను తీసుకెళ్తున్న గ్రామస్థులు

యార్డు, రైతు బజార్ల ద్వారా ఉల్లి కొనుగోళ్లు

జిల్లాలో ఉల్లి పంట సాగు చేసిన రైతులు తమ దిగుబడులను ఆయా మార్కెట్ యార్డులు, రైతు బజార్లలో విక్రయించుకోవచ్చు. వారు దిగుబడులు తీసుకువచ్చి అక్కడే ఎవరికైనా విక్రయించవచ్చు. రైతులు ఏ విధమైన గుర్తింపు కార్డులు చూపాల్సిన అవసరం లేదు. నేరుగా మార్కెట్ యార్డులు, రైతు బజార్లకు వెళ్లి కిలో రూ.12 ప్రకారం విక్రయించుకునే అవకాశం కల్పించాం. ఉల్లి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, కలెక్టర్, వైఎస్సార్ కడప జిల్లా

మద్దతు ధర ప్రకటించాలి...



ఎర్రగుంట్ల మండలం దండుపల్లిలో అరెకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. త్వరలో పంట దిగుబడి వస్తుంది. ధర చూస్తే రూ.1000 ఉంది. గత నెలలో క్వింటా ఉల్లి గడ్డలు రూ.1500 నుండి రూ.1800ల వరకు పలికాయి. ప్రస్తుతం క్వింటా ఉల్లి ధర రూ.500లు పలికితే పూర్తిగా నష్టపోతారు. ఈ ధర ఏమాత్రం గిట్టుకోదు. ప్రభుత్వం ఉల్లికి రూ.3 వేల మద్దతు ధర ప్రకటించాలి. పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. దళారీల ప్రమేయం ఎక్కువగా ఉండడంతో రైతు నష్టపోవాల్సి వస్తోంది.
– గంగా సురేష్, ఉల్లి రైతు, దండుపల్లి, యర్రగుంట్ల మండలం

కూలి డబ్బులు కూడా రావు



ఎకరా ఉల్లి పంటకు పెట్టుబడులు రూ.70 వేలు ఖర్చు అవుతోంది. ఎకరా పంట కోత తీసేందుకు 12మంది కూలీలు అవసరం. మొత్తం ఉల్లి పంట కోయడానికి దాదాపు 40 మంది కూలీలు అవసరం అవుతారు. వారికి కూలి డబ్బులు దాదాపు రూ.22 వేలు అవుతుంది. మంచి దిగుబడి ఉన్నా ధర పతనం కావడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఉల్లి దిగుబడులు కొనుగోలు చేయాలి.
– పురుషోత్తమరెడ్డి, ఉల్లి రైతు, అహోబిలం

తోటల వద్దే కొనుగోలు చేయాలి



తోటల వద్దే ఉల్లి దిగుబడులు కొనుగోలు చేయాలి. మార్క్‌ఫెడ్ అధికారులు రైతులను దిగుబడులు అక్కడికి తీసుకురమ్మంటున్నారు. తీసుకెళ్లిన తర్వాత గ్రేడింగ్ చేసి ఖచ్చితమైన ధర రావచ్చు.. రాకపోవచ్చు అంటూ చెబుతున్నారు. దీంతో మార్కెట్‌కు రావాలంటే భయం వేస్తోంది. కర్నూల్ మార్కెట్‌లో రైతుకు క్వింటా రూ.500 నుంచి రూ.350 వరకు ధర ఇవ్వడంతో ఉల్లిగడ్డలను రోడ్డుపై పారబోశారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి రైతుల వద్ద కొనుగోలు చేయాలి.
– మల్లికార్జునరెడ్డి, ఉల్లి రైతు, అహోబిలం

ఇంకా అనుమతులు రాలేదు...



ఉల్లి కొనుగోలు గురించి మాకు ఇంకా ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాలేదు. అనుమతుల కోసం ఉన్నతాధికారులకు లెటర్ పెట్టాం. రైతులు దిగుబడులు తీసుకువస్తామని చెబుతున్నారు. కానీ అనుమతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఉల్లి కొనుగోలు చేయాలంటే ఎంతో కొంత ఫండ్ కావాలి. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే కొనుగోలు చేస్తాం.
– పరిమళజ్యోతి, డీఎం, మార్క్‌ఫెడ్

22 నుంచి దసరా ఉత్సవాలు


ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు


ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. దేవీ శరన్నవ రాత్రులకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను గురువారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా వేడుకలలో భాగంగా రోజూ అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. లోకకల్యాణార్థం లక్ష్మీగణపతిహోమం, సుదర్శన, పవమాన, అరుణ, సరస్వతి, రుద్ర, దుర్గా, చండీ హోమాలు, వేదపారాయణం యంత్ర ఆరాధన, జప పారాయణం నిర్వహిస్తామన్నారు. రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి మూలవిరాట్‌లను పూలు, గాజులు, నగదు, కూరగాయలు, ముత్యాలకవచం, వత్తిపత్తితో అలంకరిస్తున్నామన్నారు. అసౌకర్యం కలుగకుండా బారీకేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్ : కూటమి ప్రభుత్వ తీరు మారకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రణభేరి ప్రచార జాత గురువారం సాయంత్రం కడపకు చేరుకుంది. యూటీఎఫ్ నాయకులు సాదర స్వాగతం పలుకుతూ కడప ఆర్టీసీ బస్టాండ్ నుంచి మహావీర్ సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్ మీదుగా బాలాజీ నగర్ యూటీఎఫ్ భవన్ వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరొకలా పాలకులు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఉద్యోగులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆరు నెలలలోగా ఆర్థిక బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి, నాయకులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్, ఎస్.జాబీర్, సమీర్‌బాషా, నరసింహారావు, వై.రవికుమార్ డి.సుజాతరాణి, సివి.రమణ, ఎస్.ఎజాస్ అహమ్మద్, డి.క్రిష్టారెడ్డి, సి.సుదర్శన్, ఎద్దు రాహుల్, వీరపోగురవి, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి డిగ్రీ విద్యాసంస్థల బంద్


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధుల విడుదల కోరుతూ ఈ నెల 22వ తేదీ నుంచి డిగ్రీ విద్యా సంస్థల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు వైవీయూ డిగ్రీ కాలేజీ ప్రైవేటు మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటశీను తెలిపారు. యోగివేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ పద్మసురాయన గురువారం కలిసి బంద్ నోటీసులు అందజేశారు. వెంకట శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 6400 కోట్ల బకాయిలు ఉన్నాయని, అనేకమార్లు అధికారులకు వినతిపత్రం అందించినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా, ఫీజులు వసూలు చేయకుండా ఉండాలని ప్రభుత్వం నుంచి హుకుం జారీ చేశారన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యాసంస్థలు నిర్వహించలేక బంద్‌కు పిలుపునిచ్చామని తెలిపారు. సంజీవరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటం.. హంగామా.. అంతలో వెనక్కు

డీఎస్సీ అభ్యర్థులకు నిరుత్సాహం


విజయవాడకు బయలు దేరేందుకు డీఈఓ కార్యాలయం వద్ద సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్సులు

కడప ఎడ్యుకేషన్ : డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులందరినీ విజయవాడకు పిలిపించి ఏదో హంగామా చేయాలని భావించారు.. వారికి ఆర్భాటంగా నియామక పత్రాలను అందిస్తామని చెప్పడంతో అభ్యర్థులు ఆఘమేఘాలపై పరుగున వచ్చారు. తీరా అక్కడ పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినందున నిలిపివేశామనడంతో వారు నిరుత్సాహానికి గురయ్యారు. కడప జిల్లా డీఎస్సీ అభ్యర్థులు, వారికి తోడుగా వచ్చే బంధువులను విజయవాడకు తరలించేందుకు కడప డీఈఓ కార్యాలయం వద్ద బస్సులను(జిల్లా నుంచి 40 బస్సులు) సిద్ధం చేశారు. నలుమూలల నుంచి చాలా మంది డీఎస్సీ అభ్యర్థులు వేకువగానే కడప డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. టిఫిన్ చేసి బయలు దేరేందుకు బస్సులు కూడా ఎక్కారు. ఇంతలోనే కార్యాక్రమం రద్దు చేశారని మేసేజ్ వచ్చింది. డీఎస్సీ అభ్యర్థులు నిరుత్సాహ పడిపోయారు. ఎక్కడి నుంచి వచ్చారో మళ్లీ వెనక్కు వెళ్లారు. డీఈఓ షేక్ షంషుద్దీన్‌తో మాట్లాడగా అధిక వర్షంతో విజయవాడలో కార్యక్రమం రద్దు అయిందని తమకు సమాచారం వచ్చిందన్నారు. త్వరలో మళ్లీ ఎప్పుడు ఉంటుందనే విషయాన్ని అభ్యర్థులకు తెలియచేస్తామని తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి.. చోరీల బాట

– రూ.8లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

బద్వేలు అర్బన్ : జల్సాలకు అలవాటుపడి సులువుగా చోరీ చేస్తున్న ఇద్దరు యువకులను బద్వేల్ అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.8 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో విలేకరులకు డీఎస్పీ జి.రాజేంద్ర ప్రసాద్ వివరాలు వెల్లడించారు. కడప నగరంలోని మరాఠి వీధికి చెందిన నారాయణ దిలీప్‌కుమార్, భాగ్యనగర్ కాలనీకి చెందిన షేక్‌నాయబ్‌రసూల్ స్నేహితులు. కడప నగరంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న వీరు జల్సాలకు అలవాటుపడి చోరీలు చేయడం అలవాటు చేసుకున్నారు. నాలుగేళ్ల కిందట సొంత అన్న ఇంట్లోనే ఇరువురు కలిసి చోరీకి పాల్పడ్డారు. ఈ నెల 10న బద్వేల్‌కు వచ్చిన ఇరువురు వెంకటయ్యనగర్‌లో శ్రీనివాసులు ఇంటికి తలుపులు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు విచారించిన పోలీసులు బద్వేల్-మైదుకూరు రహదారిలో నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 118.04 గ్రాముల బంగారు ఆభరణాలు, 40 గ్రాముల నాలుగు వెండి బిళ్లలు లభించాయన్నారు. అర్బన్ సీఐ లింగప్ప, ఎస్‌ఐలు సత్యనారాయణ, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో పది మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాజీలేని పోరాటం చేయాలని నిర్ణయించినట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య తెలిపారు. వైఎస్సార్ స్మారక ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష యువజన సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి ఒక్క కొత్త మెడికల్ కళాశాల కూడా తీసుకురాలేకపోయారని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 కొత్త మెడికల్ కాలేజీలను రాష్ట్రానికి మంజూరు చేయించి, అందులో 8 మెడికల్ కాలేజీలను పూర్తి చేసి తరగతులు ప్రారంభించారన్నారు. చంద్రబాబు సొంతజిల్లా అయిన చిత్తూరులోని మదనపల్లెలో 98 ఎకరాల్లో రూ.700 కోట్లు ఖర్చు చేసి మెడికల్ కాలేజీ నిర్మిస్తే దాన్ని కూడా ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం సిగ్గుచేటన్నారు. పాడేరు, పులివెందుల మెడికల్ కాలేజీలు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ 50 మెడికల్ సీట్లు కేటాయిస్తే వద్దని లేఖ ఇచ్చిన దద్దమ్మ ప్రభుత్వం ఇదేనని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణను రద్దు చేసేవరకూ పోరాటం ఆపేది లేదని, రాస్తారోకోలు, ముట్టడి కార్యక్రమాలతోపాటు, ఛలో అసెంబ్లీకి కూడా పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు రవి, చంద్ర, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గురుప్రసాద్, నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, ఏఐవైఎఫ్ నాయకులు ప్రభాకర్, ఏఐఎస్‌బి నాయకులు రాజేంద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో స్క్రాప్ అక్రమ రవాణాను సహించేది లేదని ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావు అన్నారు. విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్టీపీపీలో 600 మెగావాట్లలో ఉన్న స్క్రాప్ (పాత ఇనుము)ను ఎవరు తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల స్క్రాప్ అక్రమ రవాణాకు బాధ్యులుగా గుర్తించి ఇద్దరు ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సంస్థలో పనిచేస్తూ సంస్థ వస్తువులను బయటకు తరలించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, ఉద్యోగులు బాధ్యతారాహితంగా పనిచేయాలని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం


రసూల్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన రసూల్(50) అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈనెల 16న ఇంట్లో భార్యాభర్తల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈనెల 17న తెల్లవారుజామున నుంచి అతను కనిపించకుండా పోవడంతో భార్య రషీద కుటుంబ సభ్యులతో కలిసి పలు చోట్ల గాలించింది. అతని ఆచూకీ లభించకపోవడంతో గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం


విజయలక్ష్మి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రామేశ్వరం రోడ్డులో ఉన్న ఆణాబంకు వీధిలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన ఇంద్రకంటి విజయలక్ష్మి (53) అదృశ్యమయ్యారు. గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె తిరిగి రాలేదు. ఆమె పట్టణంలో పలు చోట్ల అప్పులు చేశారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సంజీవరెడ్డి తెలిపారు.

బాలిక అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష

వేంపల్లె : స్థానిక పుల్లయ్య తోటకు చెందిన మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో తమ్మిశెట్టి రామాంజనేయులుకు కడప కోర్టు జడ్జి డాక్టర్ సి.యామిని పదేళ్ల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్లు వేంపల్లె సీఐ నరసింహులు తెలిపారు. వివరాలలోకి వెళితే.. వేంపల్లె గ్రామంలోని పుల్లయ్యతోట వీధికి చెందిన తమ్మిశెట్టి రామాంజనేయులు వృత్తి రీత్యా పెయింటింగ్ పనిచేస్తున్నాడు. 2019 ఆగస్టు, 26న అదే వీధికి చెందిన మైనర్ బాలికను బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. అప్పట్లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. విచారించిన జడ్జి నిందితుడికి పదేళ్ల సాధారణ జైలు శిక్షతోపాటు రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు సీఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

ఖాజీపేట : జూదమాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఖాజీపేట సీఐ వంశీధర్ తెలిపారు. నాగసానిపల్లె పొలాల్లో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామని, వారి నుంచి రూ.78,470 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లాటరీ ద్వారా బార్ల కేటాయింపు


లాటరీ తీస్తున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : లాటరీ ద్వారా జిల్లాలో ఏడు బార్లను గురువారం కేటాయించారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సమక్షంలో పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహించారు. అర్హత సాధించిన దరఖాస్తుదారులకు బార్లను కేటాయించారు. కడపలో నాలుగు, పులివెందుల, మైదుకూరు, బద్వేల్‌లలో ఒకటి చొప్పున బార్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవికుమార్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.